# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-07-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లా పర్యటనలో భాగంగా ఈ మధ్యాహ్నం జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు.**
2. **రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెరగాలని ఆ మేరకు కార్యాచరణ ప్రారంభించాలని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు.**
3. **ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు పని చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు.**
4. **రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రోడ్డులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు.**
5. **రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నారు.**

==========================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తిరుపతి జిల్లాలో ఈరోజు పర్యటిస్తున్నారు. తూకివాకం వద్ద గల సమగ్ర వ్యర్థాల నిర్వహణా కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం శ్రీ కపిలేశ్వర స్వామి వారిని దర్శించుకుని స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ మధ్యాహ్నం పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ సాయంత్రం అలిపిరి వద్ద ఉన్న కంచి కామ కోటి పీఠాన్ని సందర్శిస్తారు.

---------------------------

ప్రభుత్వ పాఠశాలలో ప్రవేశాలు మెరుగుపడేలా ఉపాధ్యాయులు పని చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అన్నారు. కృష్ణా జిల్లా పెనమలూరు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో అత్యుత్తమ ఫలితాలు సాధించిన ప్రధానోపాధ్యాయురాలు యలమంచిలి దుర్గా భవానిని 'షైనింగ్ టీచర్' పేరుతో గుంటూరు జిల్లా ఉండవల్లిలో మంత్రి నిన్న సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడం ద్వారా ప్రవేశాలు పెంచడమే తమ లక్ష్యమని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో జీఎస్టీ ఆదాయం పెంచేందుకు అవసరమైన కార్యాచరణ సిద్ధం చేయాలని ఆర్థికశాఖ మంత్రి

పయ్యావుల కేశవ్ అధికారులను ఆదేశించారు. విజయవాడ సమీపంలోని కుంచనపల్లి రాష్ట్ర వాణిజ్య పన్నులశాఖ ప్రధాన కార్యాలయంలో కమిషనర్లు, సంయుక్త కమిషనర్లు, అధికారులతో మంత్రి నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాణిజ్య పన్నులశాఖ అధికారులు స్మార్ట్‌గా పని చేస్తూ ఫలితాలు సాధించాలని వివరించారు.

-----------------------------

రాయలసీమను రతనాల సీమగా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు రోడ్డు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా పాములపాడులో బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి గాలేరు నగరి సుజల స్రవంతి కాల్వకు మంత్రి నిన్న నీటిని విడుదల చేశారు. కృష్ణాజలాలకు సారె సమర్పించి జలహారతి ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

వాయిస్.. 27 సెకన్లు

-----------------------------

స్వచ్ఛ సర్వేక్షణ్ 2024-25 రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కు అవార్డు రావడంపై తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి హర్షం వ్యక్తం చేశారు. న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో అవార్డుల ప్రదానోత్సవ వేడుకలలో కేంద్రమంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా ఆమె అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆకాశవాణితో మాట్లాడుతూ.. పరిశుభ్రత కోసం తీసుకున్న వినూత్న చర్యలు, స్మార్ట్ టెక్నాలజీ వినియోగం, డోర్ టూ డోర్ చెత్త సేకరణ, రీసైక్లింగ్ విధానం, పారిశుద్ధ్య సిబ్బంది కృషితో పాటు పౌరుల భాగస్వామ్యంతో ఇది సాధ్యపడిందని తెలిపారు.

-----------------------------

తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ నెల కోటాను ఈ రోజు ఉదయం ఆన్‌లైన్‌లో తిరుమల తిరుపతి దేవస్థానం- టిటిడి విడుదల చేసింది. ఈ సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ కోసం జూలై 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని ఒక ప్రకటనలో తెలిపింది. ఈనెల 21 నుండి 23వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు రుసుము చెల్లించిన వారికి టికెట్లు మంజూరవుతాయని పేర్కొంది.

-----------------------------

గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతి రాజును మంత్రులు వంగల పూడి అనిత, కొండపల్లి శ్రీనివాస్ విజయనగరంలోని ఆయన నివాసంలో ఈరోజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా హోంశాఖ మంత్రి అనిత పాత్రికేయులతో మాట్లాడుతూ.. గోవా రాష్ట్ర గవర్నర్ గా అశోక్ గజపతిరాజు నియామకం తెలుగు ప్రజలకు గర్వకారణమని అన్నారు. ప్రజలందరి తరఫున శుభాకాంక్షలు చెప్పినట్లు మంత్రి తెలుపుతూ..

వాయిస్ 27 సెకన్లు

-----------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ప్రతి నెల మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈరోజు విజయనగరం శ్రీకాకుళం, తూర్పుగోదావరి, కృష్ణా, అనంతపురం,

తిరుపతి, శ్రీ సత్యసాయి, జిల్లాలో జరిగిన కార్యక్రమాలలో మంత్రులు, శాసనసభ్యులు, కలెక్టర్లు, ప్రభుత్వ అధికారులు పాల్గొని పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ధ్యాన చంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కి ప్రత్యామ్నాయంగా అనేక వస్తువులు అందుబాటులో ఉన్నాయని వాటిని ప్రతి ఒక్కరూ వినియోగించాలని కోరారు.

-------------------------

విజయవాడలోని ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మను పౌరవిమానయాన శాఖ మంత్రి కే.రామ్మోహన్ నాయుడు, విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి నిన్న దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి రామారావు వారికి స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ అధికారులు అమ్మవారి చిత్రపటం అందజేశారు.

-------------------------

రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 26 నుంచి పర్యటన చేయనున్నట్లు భారతీయ జనత పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తెలిపారు. విశాఖపట్నంలో ఆయన నిన్న విలేకర్లతో మాట్లాడుతూ.. ముందుగా రాయలసీమ జిల్లాలు, అనంతరం ఉత్తరాంధ్ర, కోస్తా జిల్లాల్లో పర్యటించనున్నట్లు చెప్పారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 25వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

-------------------------

నీటి సంరక్షణ, నిర్వహణతో పాటు, ముఖ్యంగా వర్షపు నీటిని సద్వినియోగం చేసుకోవడానికి కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్‌లో వర్షపునీరు ఒడిసిపట్టడం "క్యాచ్ ది రైన్" అనే కార్యక్రమాన్ని చేపట్టింది. "ప్రజా అవగాహన దిశగా నీటి సేకరణలో ప్రజల భాగస్వామ్యం" అనే ఇతివృత్తంతో దేశవ్యాప్తంగా 148 జిల్లాలలో ఈ ప్రచారాన్ని నిర్వహిస్తోంది. ప్రజలు వర్షపు నీటిని సేకరించి, భవిష్యత్తులో ఉపయోగించుకునేలా ప్రోత్సహించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా వాతావరణ మార్పుల ద్వారా పెరుగుతున్న నీటి కొరత నేపథ్యంలో నీటి భద్రత, వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పునరుజ్జీవనం ప్రాముఖ్యతపై పలు అవగాహనా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

-------------------------

మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా భారత మహిళల క్రికెట్ జట్టు ఈరోజు ఇంగ్లండ్‌తో రెండో వన్డే ఆడనుంది. ఈ మధ్యాహ్నం ఇంగ్లండ్‌లోని లార్డ్స్ మైదానంలో ఈ మ్యాచ్ జరుగుతుంది. కాగా ఇప్పటికే తొలి మ్యాచ్‌లో గెలిచిన భారత్ ఈ మ్యాచ్‌లో కూడా గెలుస్తే సిరీస్ కైవసం అవుతుంది. కాగా భారత్ – ఇంగ్లండ్ పురుషుల క్రికెట్ జట్ల మధ్య నాలుగో టెస్టు ఈ నెల 23వ తేదీన ప్రారంభమవుతుంది.

-------------------------

దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, దాని పరిసర ప్రాంతాలలో ఉపరి తల ఆవర్తనం నెలకొని ఉందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని కోస్తా జిల్లాల్లో తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు అనేక చోట్ల కురిసే అవకాశముందని పేర్కొంది. రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితుల గురించి వాతావరణ శాఖ అధికారి ఎల్.నారాయణ తెలియజేస్తూ...

వాయిస్ 20 సెకన్లు

======================